క్లుప్తంగా

పన్నులు సకాలంలో చెల్లించాలి

నర్సంపేట : పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి, నల్లా, ట్రేడ్ లైసెన్స్ పన్నులు చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ జోనా కోరారు. మునిసిపల్ కార్యాలయంలో శనివారం సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పన్నుల్లో మొండి బకాయిలు ఉన్న వారిని త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ 2020లో రూ.1000 చెల్లించి రశీదు పొందిన వారు సరైన డాక్యుమెంట్స్, ఈసీ మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కుసెంటర్‌లో ఇచ్చి ల్యాండ్‌ను రెగ్యులేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ టి.సంపత్‌కుమార్, జేఏఓ ఎ.రజని, అసిస్టెంట్ ఇంజనీర్ కె.రాజేష్, టీఓఎస్.రమ్యకృష్ణ, టీపీఎస్ డి.సంధ్యారాణి పాల్గొన్నారు.

సామగ్రి దగ్ధం

సంగెం: మండలంలోని మొండ్రాయిలో పాన్నాల వీరలక్ష్మి ఇంటిని ఆనుకుని ఉన్న రేకుల షెడ్‌కు నిప్పంటుకుని అందులోని ఇంటివాసాలు, తలుపులు, దర్వాజలు, చెక్క సామగ్రి దగ్ధమైనట్లు బాధితురాలు తెలిపింది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సామగ్రికి నిప్పంటించారని, చుట్టపక్కల వారి సాయంతో మంటలను ఆర్పివేశామని, దర్యాప్తు జరిపి తనకు న్యాయం చేయాలని శనివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీరజవాన్‌కు ఘన స్వాగతం

దుగ్గొండి: 18 ఏళ్ల వీరజవాన్‌గా దేశ సేవ కోసం, దేశ రక్షణ కోసం పని చేసి పదవీ విరమణ పొందిన జవాన్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మండలంలోని నాచినపల్లికి చెందిన నాగరబోయిన రాజ్‌కుమార్ సైనికుడిగా దేశరక్షణలో భాగంగా వివిధ ప్రదేశాల్లో పని చేశాడు. పదవీ విరమణ అనంతరం శనివారం స్వగ్రామానికి చేరుకున్న రాజ్‌కుమార్‌కు గ్రామస్తులు మిత్రులు ఊరి చివరికి ఎదురేగి స్వాగతం పలికారు. పూలమాల వేసి సన్మానించారు. జ్ఞాపికలు అందించారు. మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. మురహరి, ప్రవీణ్, అయిలయ్య, నరేష్ పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత

వర్ధన్నపేట: మండలంలోని కట్ర్యాల సమీపంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై పడిన గుంత ప్రమాదకరంగా మారిందని శుక్రవారం పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య ఆధ్వర్యంలో ఎస్సై రాజు, సిబ్బంది, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, ఏఈ ఫణీంద్ర శనివారం గుంతకు మరమ్మతు చేపట్టారు. రోడ్డు కింద ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో రోడ్డు మధ్య పెద్ద గుంత ఏర్పడింది. దీంతో నడిరోడ్డుపై గుంత ఏర్పడడంతో పెద్ద ప్రమాదం ఉండగా ఈ అంశంపై పత్రికల్లో కథనం రావడంతో స్పందించిన అధికారులు వెంటనే చర్యలు చేపట్టడడంతో వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం



వర్ధన్నపేట: మండలంలోని దమ్మన్నపేట జెడ్పీఎస్ఎస్‌లో 2024–25 సంవత్సరంలో పదో తరగతిలో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని స్వర్ణలతకు శనివారం పాఠశాలలో ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10 వేలు నగదు ప్రోత్సాహకం అందచేశారు. ప్రతి ఏటా ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు పోత్సాహకం అందచేస్తారు. ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థి శ్రావణికి అదే గ్రామానికి చెందిన కుమారి లిఖిత తన వంతుగా ప్రోత్సహకాన్ని రూ. 5 వేలు అందచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మహేష్ నాయక్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వన్‌టైం సెటిల్‌మెంట్ గడువు పొడిగించాలి

నల్లబెల్లి : తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో మొండి బకాయిలను తగ్గించేందుకు ప్రభుత్వం కల్పించిన వన్‌టైం సెటిల్‌మెంట్ గడువును ఈ నెల 15 వరకు పొడిగించాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సలీంకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఆయన వెంట సురేష్ తదితరులు ఉన్నారు

దీక్షలు ప్రారంభం

గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తిహవేలిలో గౌడ కులస్తులు తమ కుల దైవం కంఠమహేశ్వరస్వామి దీక్షలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షా స్వాములు మాలధారణ చేయగా పూజారులు గ్రామ దిగ్బంధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుల పెద్దలు శోభన్ బాబు, సదానందం, రాంచందర్, యాదగిరి, జంగయ్య, రాజు, కుల సంఘం యూత్ నాయకులు పాల్గొన్నారు.

‘పల్లె వెలుగు’ఎరగని గ్రామాలు

- రోడ్లు ఉన్నా.. బస్సులు నడపని దుస్థితి
- ఉచిత బస్సు సౌకర్యానికి దూరంగా మహిళలు
- విద్యార్థులు, ప్రజలకు తప్పని తిప్పలు

నెక్కొండ : స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ల దాటినా.. నేటికి ఎర్ర బస్సు ఎరగని గ్రామాలున్నాయంటే మనం ఏ కాలంలో ఉన్నామో అర్థమవుతోంది. నేటి ఆధునిక ప్రపంచంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధిలో పోటీ పడుతుండగా మండలంలోని పలు పల్లెలు నేటికీ బస్సు సౌకర్యం లేదు. సరైన రోడ్లు ఉన్నా.. బస్సు సౌకర్యం, రవాణా సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యానికి మహిళలు, దివ్యాంగులు, అర్హులైన విద్యార్థులు దూరంగా ఉండాల్సి వస్తోంది. మండలంలో 39 గ్రామ పంచాయతీలుండగా 19 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. అందులో 10 గ్రామాలకు బీటీ రోడ్లు ఉన్నా.. ఆర్టీసీ అధికారులు అటువైపు కన్నేసి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ప్రజలు ఆర్టీసీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి రాకపోకలకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు.

పక్కా రోడ్లు ఉన్నా.. బస్సులు నడపరేం

మండలంలోని గొట్లకొండ, పత్తిపాక, బొల్లికొండ, సీతారాంపురం, చిన్నకొర్పోలు, సూరిపల్లి, రెడ్లవాడ, హరిచంద్రుతండా, నెక్కొండ, వెంకట్ తండా జీపీలకు పక్కా రోడ్లు ఉన్నాయి. అయినప్పటికీ ప్రజలు నిత్యం ఏదో పని మీద పక్క గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ప్రైవేట్ వాహనాలతో ఇబ్బందులు ఉండడమే కాకుండా ప్రయాణి చార్జీలు ఎక్కువగా ఉంటున్నాయి. ప్రజలు సురక్షిత ప్రయాణం కోసం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ప్రస్తుతం పక్కా రోడ్లు ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు బస్సులను నడపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పత్తిపాక బీటీ రోడ్డు



బొల్లికొండ బీటీ రోడ్డు

మూణ్ణాళ్ల ముచ్చటే



బొల్లికొండ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ కల్పించాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు విజ్ఞప్తి చేశా.. ఎండీ ఆదేశాల మేరకు వరంగల్ రీజనల్ మేనేజర్ సూచనలతో మహబూబాబాద్ డిపో బస్సు సర్వీస్ నడిపారు. కానీ అర్ధంతరంగా సర్వీస్ నిలిపివేశారు. కాలి నడకన, లేదా ఆటో, బైక్ లిఫ్ట్ అడిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

– బానోతు రమేశ్‌నాయక్, సామాజిక కార్యకర్త, బొల్లికొండ

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే మా మహిళలకు అది అందని ద్రాక్షలా మిగిలింది. గతంలో నెక్కొండ నుంచి పత్తిపాక మీదుగా సాయిరెడ్డిపల్లి వయా పర్వతగిరికి ఆర్టీసీ బస్సు సర్వీస్ ఉండేది. నేడు అటు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టింపు లేమితో సర్వీస్ నడవడం లేదు.

– బొల్లెబోయిన రాజమ్మ, మాజీ సర్పంచ్, పత్తిపాక

చదువులో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట: చిన్నారులు చదువులో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మరాయినిపహడ్ సెయింట్ థెరిస్సా పాఠశాల 17వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. చదువులో పోటీతత్వం ఉన్నప్పుడు ఉన్నత స్థానాల్లో నిలుస్తామన్నారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు భూక్య గోపాల్‌నాయక్, చర్చి ఫాదర్ యాగారెడ్డి, కరస్పాండెంటింట్ అన్నమేరి, ప్రిన్సిపల్ ఆరోగ్య శౌరీలు, నియోజకవర్గ నాయకులు సాంబయ్య, వర్కింగ్ పెసిడెంట్ రమేష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు

ఖానాపురం : చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ పెరుక సునీత అన్నారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. పీజీహెచ్ఎం ఆరీఫ్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

భార్య తిట్టిందని మనస్తాపానికి గురై..

- పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భర్త
- చికిత్స పొందుతూ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

నెక్కొండ: మండలంలోని పెద్దకొర్పోలు శివారు వెంకట్ నాయక్ తండాకు చెందిన ధారావతు శ్రీనివాస్ (42) వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై మహేందర్ శని వారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రా మానికి చెందిన శ్రీనివాస్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో కుటుంబంలో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. శుక్రవా రం రాత్రి భార్య పద్మ తాగి వచ్చిన భర్త శ్రీనివాస్‌ను మందలించింది. దీంతో భార్య తిట్టిందని శ్రీనివాస్ మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా. చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



నర్సంపేట : మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట : వరంగల్ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి మామునూరు ఎయిర్ పోర్టుకు రూ.450 కోట్లు మంజూరు చేసిన నరేంద్రమోదీకి బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని వరంగల్ రోడ్డు కూడలిలో శనివారం మోడీ చిత్ర పటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ మాట్లాడుతూ మామునూరు ఎయిర్ పోర్టు రాకతో జిల్లా ప్రజలకు మరింత అభివృద్ధి, ఉపాధి లభించనుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహారాములు, మండల అధ్యక్షుడు తనుడుల అంబేద్కర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్‌రెడ్డి, రంజిత్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, కార్యదర్శి శ్రీనివాస్, ఎర్ర రాజు, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు సాంబమూర్తి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ: మండలంలోని ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, మండల అధ్యక్షుడు చొక్కం శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జాన్‌విక్రం, నియోజకవర్గ కన్వీనర్ ముక్క ప్రసాద్, నాయకులు ప్రవీణ్, రాజు, సాంబరాజు, రాజిరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు సూరుపల్లి వాసి పల్లెపోతుల లక్ష్మీనర్సయ్య తల్లిదండ్రులు మల్లయ్య–సీతమ్మల జ్ఞాపకార్థకంగా పరీక్ష సామగ్రిని శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా తల్లిదండ్రుల పేరు మీద విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తామన్నారు. విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నెక్కొండలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

నెక్కొండ : అక్రమంగా నిల్వ చేసిన బెల్లం, పటిక, గుడుంబాలను స్వాధీనం చేసుకొని నెక్కొండకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై శిరీష తెలిపారు. శనివారం హై స్కూల్ సెంటర్‌లోని కిరాణం షాపులో అక్రమంగా నిల్వ ఉన్న 20 కిలోల బెల్లం, 8 కిలోల ప టికను స్వాధీనం చేసుకొని షాపు యజమాని దుబ్బ పార్వతిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే సద్యాల వెంకటలక్ష్మి, లావణ్య, సారయ్య, సాయమ్మ గుడుంబా విక్రయాలకు పాల్పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

చెన్నారావుపేట : విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంపొందించుకున్నపుడే విజయాలు సాధిస్తారని వయోవృద్ధుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఈగ సత్యనారాయణ, కార్యదర్శి సాంబయ్య, కోశాధికారి కుమారస్వామి అన్నారు. అమీనాబాద్ మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, ఉప్పరపల్లి, కోనాపురం, జల్లీ, చెన్నారావుపేట, లింగాపురం, పాపయ్యపేట హైస్కూ ళ్ల లోని బాల బాలికలకు జీవన నైపుణ్యాలను అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.

ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం

వర్ధన్నపేట : ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం సాధ్యమైందని, వర్గీకరణ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహలకు మాదిగ సమాజం రుణపడి ఉంటుందని రిటైర్డ్ ప్రొఫెసర్ ముత్తయ్య, బందు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అన్నారు. శనివారం పట్టణంలో బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వశపాక నరసింహ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.

ఎస్ఆర్ఆర్ చేయూత

రాయపర్తి: తండావాసుల దాహార్తిని తీర్చేందుకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి చేయూతనందించినట్లు ఆ ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి తెలిపారు. మండలంలోని బాల్‌నాయక్‌తండా వాసులు చేతిపంపును మరమ్మతు చేయించాలని శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన ఆయన మరమ్మతు కోసం రూ.25 వేలు అందించి చేయించినట్లు తెలిపారు.

వరిలో చీడపీడల నివారణ చేపట్టాలి

గీసుకొండ : వరి, మొక్కజొన్న చేలలో చీడ పీడల నివారణ చర్యలు చేపట్టాలని జాతీయ ఆహార భద్రత మిషన్ ప్రతినిధి పి.సారంగం, ఏఈ హరిప్రసాద్‌బాబు రైతులకు సూచించారు. శనివారం మండలంలోని ధర్మారం, గీసుకొండలో నేరుగా వరి విత్తనాలు విత్తిన పొలాన్ని, మొక్కజొన్న చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిలో బ్యాక్టీరి యా, ఎండకు తెగులు, కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు , సుడిదోమ, గింజమచ్చ తెగులు, నల్లి నివారణకు అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

చిన్నారికి ఐజేయూ చేయూత

రాయపర్తి: తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన కొత్తరాయపర్తికి చెందిన చిన్నారి దుబ్బరి రచనకు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్‌రామచంద్రయ్య చేయూతనందించారు. శనివారం గ్రామానికి చేరుకున్న ఆయన స్థానిక విలేకరులతో కలిసి రచనను పరామర్శించారు. తల్లిదండ్రులు రాజు, రేణుక అనారోగ్యంతో మృతి చెందారన్నారు. రచనకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన రచనకు చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు చేయూతనందించారు. ఆమెకు రూ.6 వేలు ఆర్థికసాయంగా అందించారు.

ఎస్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

చెన్నారావుపేట: మండలంలోని లింగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు బూర మానస, మైదం గీతాంజలిలు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం అబ్దుల్ సలీం తెలిపారు. విద్యార్థులను శనివారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం 8వ తరగతి విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఈ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహిస్తారన్నారు.

ఉప్పరపల్లి విద్యార్థిని ఎంపిక

మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థిని చిలపాక ద్రాక్షాయని ఎస్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం తేజావత్ జయ తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో అభినందించారు.

రైతుల ఇబ్బందులు తీర్చేందుకే పూడిక తీత

రాయపర్తి: రైతులకు సాగునీరందించేందుకే మైలారం ఎస్సారెస్పీ ఉపకాల్వలోని పూడికతీత పనులను చేయిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మైలారం ఎస్సారెస్పీ కాల్వలో మట్టిపేరుకుపోయి నీళ్లకు ఇబ్బందులవుతున్నట్లు రైతులు తెలపడంతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి ఆదేశాల మేరకు పూడికతీత పనులను చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి

సంగెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నల్లబెల్లి, బాలనాయక్‌తండా, నార్లవాయి, ముమ్మడివరం గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ స్థాయి సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి అధిక స్థానాలు గెలుపొందడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు.జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జనగాం రమేశ్, పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

విద్యార్థులు జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజమణి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు,జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, వ్యవసాయాధికారి అనురాధ, నర్సంపేట ఎంపీఓ రామ్మోహన్‌రావు, సంగెం ఏఓ యాకయ్య సూచించారు. నర్సంపేట, వర్ధన్నపేట నెక్కొండ, సంగెం గీసుకొండ, ఖా నాపురం, దుగ్గొండి మండలాల్లో ప్రభుత్వ పా ఠశాలల్లో జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు పదో విద్యార్థులకు నైపుణ్యం పెంపొందించడానికి స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో వారు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే వారి జీవితంలో మంచి జీవన నైపుణ్యాలైన స్వీయ అవగాహన, సానుభూతి, సమస్యల పరిష్కార నిర్ణయాలు తీసుకునే ఆలోచనలు ఉండాలన్నారు. వీటికి తోడు ప్రతిభాపూర్వక భావవ్యక్తీకరణ, విమర్శనాత్మక ఆలోచన, పరస్పర వ్యక్తిగత సంబంధాలు, ఉద్వేగాలను ఎదుర్కొనేటట్లు, ఒత్తిడి నియంత్రణ వంటి నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు.

– సాక్షి, నెట్‌వర్క్



నెక్కొండ : మాట్లాడుతున్న జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజమణి



గీసుకొండ: మొగిలిచర్లలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు



వర్ధన్నపేట : మాట్లాడుతున్న డీపీఓ కల్పన



నర్సంపేట: మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

బాధిత కుటుంబాలకు పరామర్శ

నర్సంపేట: పట్టణంలోని 23వ డివిజన్ కౌన్సిలర్ బాణాల ఇందిర భర్త, బీఆర్ఎస్ నాయకుడు బాణాల రాంబాబు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ బాధ్యులు, మాజీ కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సాంబయ్యగౌడ్, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తిరుపతి రాంబాబు మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులు పరామర్శించారు. వారి వెంట కౌన్సిలర్ వినోదసాంబయ్య, విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు ఉన్నారు.

ఖానాపురం: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఖానాపురం గ్రామానికి చెందిన రాంనర్సింహారెడ్డి, బుధరావుపేటకు చెందిన లచ్చమ్మ, ఖానాపురంకు చెందిన వెంకటేశ్వర్‌రావులు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పులిగిల్ల యాదగిరి, తదితరులు ఉన్నారు.



నర్సంపేట : మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా, ఎంఈఓగా, హెచ్ఎంగా, ఉపాధ్యాయులు పలువురు విద్యార్థులు విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదన్నారు. సమాజ నిర్మాతలను, దేశానికి బావి భారత పౌరులను అందించడంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉత్తమ ప్రతిమ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్‌లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



నర్సంపేట : విద్యార్థులతో ఉపాధ్యాయులు



వర్ధన్నపేటలో..



సంగెం: స్వయపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



నర్సంపేట రూరల్ : ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఎంఈఓ సారయ్య

మాదిగ అమరవీరులకు నివాళి

ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమంలో అమరుల ఆశయాలను కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులైన వారికి మండల శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు వురు మాట్లాడుతూ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ వారి త్యాగాల సాక్షిగా వర్గీకరణ సాధిస్తామని అన్నారు. సమావేశాల్లో ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

–సాక్షి, నెట్‌వర్క్



పర్వతగిరి : అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



రాయపర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద..



నెక్కొండలో..

రైతుల సంక్షేమమే ధ్యేయం

చెన్నారావుపేట: రైతుల సంక్షేమమే లోడి సాంఘీక సేవా స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని సంస్థ కో ఆర్డినేటర్స్ కిరణ్‌రెడ్డి, ఎస్.వీరబాబులు అన్నారు. మండలంలోని ఉప్పరపల్లిలో కలామ్స్ ఫౌండేషన్ వారి సూచనల మేరకు లోడి సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి ఆదేశాల మేరకు నల్లకుంట (బతుకమ్మ చెరువు) కట్ట ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం కలామ్స్ పౌండేషన్ కార్యదర్శి పరికి మధుకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా మా సంస్థ ద్వారా పంట కాల్వలను, చెరువు కట్టలను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలని, దాని ద్వారా ప్రజలకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు.